


# సరదా కాల్

— కాకాని కమల

ఇంట్లో ఒంటరిగా ఉన్నాను.

నాకు బోర్‌గా వుంది. తోచటంలేదు.

కొత్తగా వచ్చిన ఫోన్ టేబిల్‌మీద ముద్దొస్తుంది.

అమ్మా నాన్న ఎవరిదో పెళ్లి ఉందని ఊరికి వెళ్లారు. రాత్రి కో రేపు ఉదయానికో వస్తారు.

''ఏం చేద్దాం?'' అని ఆలోచిస్తూ టెలిఫోన్ డైరెక్టరీ తీసి తిరగెయ్యటం మొదలుపెట్టాను.

ఇంతలో ఎదురింట్లోని మా ఫ్రెండ్ కవిత 'హాయ్' అంటూ లోపలికి వచ్చింది.

''మీ అమ్మా నాన్న ఊరికెళ్లారుగా? ఒక్కర్తివి ఏం చేస్తున్నావ్?'' అంది.

''ఏం తోచడంలేదు. అందుకే డైరెక్టరీ తిరగేస్తున్నాను.''

''ఎవరికైనా ఫోన్ చెయ్యాలా?''

''చెయ్యాలనే వుంది. కానీ ఎవరు ఇక్కడ తెలుసున్న వాళ్లు లేరు''

''ఏంటి? చెప్పు...''

''ఎవరికన్నా చేతికొచ్చిన నెంబర్ డయల్‌చేసి వాడితో కాస్సేపు ప్రేమ కవిత్వం వల్లె వేద్దామా?''

''ఏదన్న గొడవైతే?''

''ఏం గొడవ అవుతుంది. ఏది కాదు. అంతగా అయితే ఫోన్ పెట్టేద్దాం''

''సరే...'' ఉత్సాహంగా రిసీవర్ తీసి ఏ నెంబరు చేద్దాం?'' అన్నాను.

''ఉండు డైరెక్టరీ చూద్దాం. నీకేం పేరు ఇష్టమో చెప్పు''

''అలాగే'' ఒక్క క్షణం కళ్లుమూసుకున్నాను. నా మనస్సు ఉత్సాహంతో ఉరకలు వేస్తుంది.

నా మనస్సులో 'సురేష్' అన్న మూడు అక్షరాలు కదిలాడుతున్నాయ్. అతను బెంగుళూరులో నా కాలేజీమేట్. నాతోపాటే ఇంజనీరింగ్ చదువుతున్నాడు. నా కంటే ఓ సంవత్సరం సీనియర్. అతను నేను మాంచి ఫ్రెండ్స్. కేవలం ఫ్రెండ్‌షిప్పేనా అని మీరు అడగవద్దు. స్నేహం కంటే అతీతమైన ఉదార భావన ఏదో మా...

''ఏయ్ మీనా! నిన్నే ఏదన్న ఒకళ్ల పేరు చెప్పు. నెంబర్ చెప్తా''

''సురేష్'' అన్నాను ఉత్సాహంగా.

సురేష్... అంటే ఎస్... ఆ... ఎస్‌యుఆర్.. సురేష్ డి. సిక్స్ ఎయిట్ జీరో నైన్ నైన్...'' నెంబర్ చెప్పింది కవిత.

ఆనందంగా ఆ నంబర్ నొక్కి ''ఆ నెంబర్ రింగ్ అవుతుందేవ్. నేనే మాట్లాడనా?'' అన్నాను ఉద్విగ్నంగా.

ఇంతలో అవతల్నుంచి ఎవరో ఫోన్‌ఎత్తి ''హలో'' అన్నారు.

ఆ గొంతు మగ గొంతు. చాలా స్వీటుగా హుందాగావుంది

నా మనస్సు ఒక్క క్షణం ఉద్విగ్నంగా అయ్యింది.

చప్పున మౌత్‌పీస్ దగ్గర చేతులు అడ్డంపెట్టి ప్లీజ్ నువ్వు మాట్లాడవే'' అన్నాను కవితకేసి చూస్తూ.

''అమ్మో నాకు తెలవదు ఫోన్‌చేసింది నువ్వు. నువ్వే మాట్లాడు'' అంది కవిత. ఇంకా నాకు తప్పలేదు.

''హల్లో...'' అన్నాను.

''ఎస్''

''సురేష్‌గారు కావాలండి''

''ఎస్. స్పీకింగ్''

జంటిల్‌గా వున్న ఆ గొంతు వింటుంటే నాకు బెంగుళూరులోవున్న సురేష్ జ్ఞాపకం వచ్చాడు. నా మనసు ఎగ్జయిటింగ్‌గా అయింది. ఈ ఫోన్ సురేష్‌ని బాగా ఏడిపించాలనిపించింది.

''హాయ్ సురేష్ ఏంచేస్తున్నావ్?'' అన్నాను. నా మూడ్ మారిపోయింది.

''నేనా? ఇంతకి మీరెవరు?''

''నా పేరు మీనా''

''నాతో ఏం పని?''

''...'' అవతలివైపు నుంచి రెండు నిమిషాలు మౌనం. తరువాత సురేష్ 'ఎందుకు?' అన్నాడు.

ఆ గొంతులోని తత్తరపాటు నాకు స్పష్టంగా తెలిసింది.

మౌత్‌పీస్‌మీద చెయ్యి అడ్డంపెట్టి కవితకేసి చూసి ''మొహమాట పడుతున్నాడు గురుడు. ఆడపిల్ల తనకిగా తాను అడగటం కదూ. డంగైపోయి వుంటాడు తింగరిపణను'' అన్నాను.

కవిత సైలెంట్‌గా నవ్వుతూంది.

నేను మళ్ళీ మౌత్‌పీస్ మీంచి చేతిని తొలగించి గొంతుని సాధ్యమైనంత మార్దవంగా మారుస్తూ-

''ఎందుకేంటి సురేష్. ఒక అందమైన అమ్మాయి అబ్బాయి కాస్సేపు సర్దాగా కల్సిమెలిసి మాట్లాడుకోవటానికి కారణాలు కావాలా ఏంటి... సిల్లీ'' అన్నాను.

అవతల్నుంచి మళ్ళీ రెండు నిమిషాలు మౌనం తర్వాత ''నిజమే కానీ... మనిద్దరికీ పరిచయం లేదు కదా ఇంతవరకు?''

''అదిగో మళ్ళీ అదేమాట డార్లింగ్, ఇంతవరకు లేకపోతేనే. ఇంకముందు అవుతుంది. ఒకసారి కల్సుకుంటేనే కదా పరిచయం అయ్యేది. ఆ పరిచయం స్నేహంగా మారేదిను...''

''ఆల్‌రైట్''

చెప్పు సురేష్ ఎప్పుడు కల్సుకుందాం''

''నేను మీ ఇంటికి వస్తాను. మీ ఇంటి అడ్రసు ఏమిటి?'' ఉలిక్కి పడ్డాను.

''ఇ... ఇంటి అడ్రస్సా''

''అవును మీ ఇంటి అడ్రసు చెప్తే సాయంత్రం వస్తాను''

''మా ఇ... ఇంటి అడ్రస్సు...'' బిక్కమొహంపెట్టి కవితకేసి చూశాను. ఇంటి అడ్రసు చెప్తే ఇంకేమైనా వుందా? కొంప మునుగుతుంది. నేను నిజంగా అతన్ని కల్సుకోవాలని ఫోన్ చేయలేదు. సర్దాగా టైమ్ పాస్‌కి చేశా... నా గుండె వేగంగా కొట్టుకుటుంది.

''హల్లో... నిన్నే మీనా... మీ ఇంటి అడ్రస్...''

కవిత ''పెట్టేయ్ ఫోన్'' అంది సైగచేస్తూ...

అంతే టప్పున ఫోన్ క్రెడిల్ చేశాను.

నాకు చెమటలు పడుతున్నాయి.

''ఇంటి అడ్రసు అడుగుతున్నాడే''

ఇల్లు తెలిస్తే పాపం వద్దామని ఆశపడ్డాడేమో...'' వెక్కిరించింది.

''పాపం ఆశపడి ఉంటాడు. భలే తమాషా చేశాం కదూ?''

''మళ్ళీ ఎప్పుడైనా చేద్దామా?'' అంది కవిత.

''ఇవ్వాల్టికీ డోస్ చాల్లే. ఇంకోసారి ఇంకొడ్ని ఆడిద్దాం'' అన్నాను.

ఆ రాత్రికే ఊరికెళ్లిన తల్లితండ్రులు వచ్చేయటంతో ఆ సందట్లో పడిపోయింది మీనా.

★★★

ఆ మర్నాడు సాయంత్రం ఆరు గంటలవుతుంది. వసారాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు మీనా, కవిత.

ఆ సమయంలో ఇంటిముందు మారుతీ వ్యాన్ ఆగింది. దానిమీద టెలికమ్యూనికేషన్స్ అన్న అక్షరాలు చూస్తూనే తమకి వారం రోజుల క్రితమేకదా ఫోన్ కనెక్షన్ వచ్చింది. బహుశా వాళ్లకి సంబంధించిన వాళ్లెవరైనా అయివుంటారు అనుకుంటూ లోపలికి వచ్చి ''నాన్నా! నీ కోసం ఎవరో టెలిఫోన్స్ ఆఫీసునుంచి వచ్చారు'' అంది.

''అలాగా! ఎవరమ్మా?'' అంటూ షీటు మీద ఏదో బిల్డింగ్ ప్లాన్ గీసుకుంటున్న ప్రభాకర్‌రావుగారు ఇవతలకి వచ్చారు.

అప్పటికే ఆ వ్యాన్ డ్రైవర్ గేటు తెరుచుకుని లోపలికి వచ్చాడు.

''కె. ప్రభాకర్‌రావు, ఇంజనీర్‌గారిల్లు ఇదే కదండీ?''

''అవును''

''మీ ఫోన్ నెంబర్ సెవెన్ జీరో సిక్స్ ఎయిట్ త్రినే నా అండి''

''ఎస్.. ఇంతకీ ఏమిటి పని?''

''మా టెలికం డివిజన్ మానేజర్‌గారు వచ్చారండి''

''అరెరె... అలాగా రమ్మనండి'' అంటూ ప్రభాకర్‌రావు కారులో కూర్చున్న టెలికం ఆఫీసరుగార్ని సాదరంగా లోనికి ఆహ్వానించాడు.

''మీరు ప్రభాకర్‌రావుగారు కదండీ''

''అవునండి. ఇంజనీర్ని. మీరు...''

''నా పేరు సురేష్. టెలికంలో సెక్షన్ మానేజర్ని. మీతో కాసేపు మాట్లాడాలని వచ్చాను'' ఆయన చిరునవ్వుతో కళ్లజోడు సవరించుకున్నాడు. సురేష్ పేరు యంగ్‌గా వుందిగాని ఆయన వయస్సు యాభై పైమాటే. మందంతో బాల్‌హెడ్ వచ్చింది. గుబురుగావున్న మీసాలు, తలమీద అక్కడక్కడ పలచగా ఉన్న జుట్టు, కళ్లకింద నలుపు చారలు వచ్చేయి. తెల్లని దుస్తుల్లో ఇన్‌స్టర్ట్ చేసుకుని కళ్లద్దాలతో హుందాగా ఉన్నాడు.

''మీ ఇంట్లో మీనా అని...''

''మా అమ్మాయేనండి. బెంగుళూరులో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతుంది''

''ఐ.సి ఒకసారి పిలుస్తారా?''

ప్రభాకర్‌రావు కళ్ళు ముడిపడ్డాయి. అనుమానంగా చూస్తూ-

''ఏనీ ప్రాబ్లమ్?'' అన్నాడు.

''నో... నథింగ్ టు వర్రి. జస్ట్ ఐ వాంట్ టుటాక్ విత్ హెర్''

''అలాగా! ఒకే'' అంటూ అమ్మా మీనా అంటూ లోపలికి కేక వేశారు.

''కాసిన్ని మంచినీళ్లు తీసుకురా తల్లి''

''అలాగే నాన్న'' అంటూ.

రెండు గ్లాసులతో నీళ్లు తెచ్చి తండ్రికి అందించింది మీనా.

షర్ట్, షర్వార్ కమీజు, ముందు పప్పి కటింగ్‌తో పోనీటైల్, ట్రిమ్ము చేసిన కనుబొమ్మల మధ్య చిన్న టికల్ అల్ట్రా మాడరన్‌గా వున్న మీనాకేసి చూస్తూ సురేష్ చిరునవ్వు నవ్వాడు.

''నువ్వేనామ్మా మీనా''

''అవునంకుల్''

''నేను నీకోసమే వచ్చానమ్మా''

''నా కోసమా? ఎందుకంకుల్''

''ఎందుకేంటమ్మో? ఒక అందమైన అమ్మాయి అబ్బాయి సర్దాగా మాట్లాడుకునేందుకు కారణాలే కావాలా? పరిచయం లేకపోతే మాత్రమేం సురేష్ డార్లింగ్ అన్నావు కదా అని వచ్చాను''

అంతే!

షాక్ కొట్టినట్టయింది.

మీనాకి నిలువుగుడ్లు పడ్డాయి. నాలిక తడారిపోయింది

''మీ... మీ...రు''

''నిన్న నువ్వు ఫోన్‌చేసి మాట్లాడిన సురేష్‌నమ్మా''

ప్రభాకర్‌రావు అసహనంగా అరిచినట్టు అడిగాడు. ''ఇంతకీ ఏం జరిగింది మీనా''

మీనా తలదించుకుని అరచేతులుకేసి చూసుకోవటం మొదలు పెట్టింది. వర్ణించటానికి సిద్ధంగావున్న ఆ అమ్మాయి ముఖం చూస్తూనే సురేష్‌గారూ ''ఫర్వాలేదు బేబి. ఇలా కూర్చో. నువ్వు నా కూతురులాంటి దానివి'' అంటూ మీనా చెయ్యి పట్టుకుని సోఫాలో తన ప్రక్కనే కూర్చోపెట్టుకుని ప్రభాకర్‌రావుకేసి తిరిగి నిన్న జరిగిన ఫోన్ సంభాషణ చెప్పి-

''మీరు మీనాని తిట్టకండి. కాని మనంచేసే కొన్ని చిలిపి పనులే చిలికి గాలి వానలు అవుతాయి. లేనిపోని కష్టాలు కొని తెచ్చుకున్న వాళ్లమే అవుతాము. నా స్థానంలో ఏ జులాయి రకమో టీనేజ్ కుర్రాడో వుంటే మీనా చిక్కుల్లో ఇరుక్కునేది. ఈ మధ్యన మా టెలిఫోన్స్ మీద చాలా కంప్లైయింట్ వస్తున్నాయి. ముఖ్యంగా కొందరు ఆకతాయిలు సమాజంలో అలజడి సృష్టించేవాళ్లు ఈ ఫోన్స్‌ని చాలా రకాలుగా ఉపయోగించుకుంటున్నారు. నెంబరు దొరికింది కదా అని ఆడపిల్లల్తో ఫోన్‌లో టీజింగ్ చెయ్యటం, టెలిఫోన్ ఆపరేటర్సు రిసెప్షనిస్టులతో అసభ్యంగా మాట్లాడటం తరచూ ఫోన్‌చేసి అవమానపర్చడం, లేదా వాళ్లు రైల్వే స్టేషన్లకి, విమానాశ్రయాలకి, పెద్ద పెద్ద కంపెనీలకి ఫోన్లుచేసి బాంబు వుందని బెదిరించటం... ఇలా చాలా రకాలుగా దుర్వినియోగం చేస్తున్నారు. ఇంకొందరు టైమ్‌పాస్‌కోసం చేతికొచ్చిన నంబర్ డయల్‌చేసి అవతలి వ్యక్తిని తప్పుతోవ పట్టించటం, మిస్‌గైడ్ చెయ్యటంకూడా జరుగుతుంది.

మనం ఒక ప్రయోజనం కోసం ఒక సౌకర్యం ఏర్పరచుకొన్నప్పుడు అందుకే ఉపయోగించుకుంటే ఉభయత్రా లాభదాయకంగా వుండి ఆ శాఖ అభివృద్ధి చెందుతుంది. లేకపోతే దుష్ఫలితాలు ఎక్కువై శాఖకి నష్టాలు వచ్చి ఆ సాంకేతిక సహకారం దెబ్బతింటుంది. అందుకే మేం ఒక నిఘా విభాగం ఏర్పాటుచేసి ఇటువంటి రాంగ్ డయల్స్ చేసేవారు ఆ ఫోన్ ఎక్కడ్నుంచి చేస్తున్నారో కనుక్కునేందుకు వీలుగా టైమ్‌తో సహా తెలిసేలా కంప్యూటర్ ఫీడింగ్ జరుగుతుంది. ఆ టెక్నిక్‌వల్ల మనకి కాల్ వచ్చిన వెంటనే ఆ కాల్ ఏ టెలిఫోన్ నెంబర్ నుంచి మనకి అందిందో తెలుస్తుంది. ప్రతి టెలిఫోన్‌కే కాక పోయిన కొన్ని ముఖ్యమైన సంస్థల్లో, మా శాఖా కార్యాలయంలో ప్రతి కమింగ్ కాల్‌కి ఆ కాల్‌చేసిన వ్యక్తి ఫోటోకూడా ప్రింట్ అయ్యేలా మేం కొన్ని కంప్యూటర్స్‌ని రూపొందిస్తున్నాం. ఈ సాంకేతిక విధానంవల్ల బాంబులు పెట్టారని, చంపుతాం అని లేదు కిడ్నాప్‌చేసి డబ్బుకోసం హెరాస్‌చేసే వాళ్లని పట్టుకోవటం సులభం అవుతుంది. మగవాళ్లే ఆడపిల్లల్ని ఏడిపిస్తారనే రోజులు పోయాయి. ఇప్పుడు ఆడపిల్లలుకూడా చాలా అడ్వాన్సు అయ్యారు. ఇలా ఫాల్స్ కాల్స్‌చేసే వారిని గుర్తించి వాళ్లకి మేం ఏదన్నా పనిష్‌మెంట్ చెయ్యాలని నిర్ణయించుకున్నాం. ఎవరు ఇటువంటి కాల్స్‌చేసినా మా శాఖ తరపున వెళ్లి వాళ్లని కల్సుకుని సంజాయిషి కోరుతాం. సరే మీ ఇల్లా మా ఇంటికి దగ్గర కావటం, అదీ ఆడపిల్ల సర్దాగా చేసింది గనుక ప్రథమ తప్పిదంగా నేను ఒదిలేస్తున్నాను. నా స్థానంలో ఏ ఆకతాయి కుర్రోడో వుండి అతనికి టెలికంలో పలుకుబడివుండి మీ ఫోన్ మీనా అడ్రసు తెలుసుకుని వుంటే ఏం జరిగేదో ఒక్క క్షణం ఆలోచించుకోండి.''

మీనా తలదించుకుంది.

మంచిచేసి తల ఎత్తుకోగలం.. తప్పుచేసి తల ఎత్తుకోగలమా? అది ఎంత చిన్నదైనా సరే.

మీనా కళ్లనుంచి కన్నీటి ముత్యాలు జారుతుంటే సురేష్‌గారు ఆప్యాయంగా ఆమె భుజం మీద తడుతూ ''టేకిట్ ఈజీ మై డాటర్'' అన్నారు.